భ్రాంతి

అజ్ఞానమనే చీకటిలో మంచి సుగంధమునందించే పూలమాలను చూచి పామని భయభ్రాంతులకు గురైపోతున్నాము. కానీ, మన భయము పాము అన్న భ్రాంతిచేత ఏర్పడినదేగాని సత్యముగా ఏర్పడినది కాదు. ఎప్పుడు మనము టార్చిని వేసి ఇది పూలమాల అని గుర్తించుదుమో అప్పుడు పాము అన్న భయం వదలిపోతుంది. అదేవిధముగనే మనము నేను దేహమును, నేను ఇంద్రియములను, నేను మనస్సును, నేను బుద్ధిని అన్న భ్రంతితో వుండటంచతనే మనము అనేక దుఃఖములకు, అనేక విచారములకు, అనేక అశాంతులకు గురైపోతున్నాము. మనము విచారణచేత దేహేంద్రియమనోబుద్ధులు నేను కాదు అనే సత్యాన్ని గుర్తించుకుంటే మనలను బాధలు ఏమాత్రముకూడను బాధించవు. మనము ఈ భయభ్రాంతులకు గురౌతున్నామంటే నిజముగా మనము దేహభ్రాంతులచేత జీవిస్తున్నాము. కనుకనే, ప్రాచీన ఋషులందరూ దేహభ్రాంతులను దూరంచేసుకొనే నిమిత్తమై, 'దేహం నేను కాదు' అన్న ఆదర్శం లోకానికి అందించే నిమిత్తమై అరణ్యములకు పోయి దేహములు త్యజిస్తూ వచ్చారు. కనుక, ఈవిధమైన సన్యాసత్వము తీసుకోటంగాని, అడవులలో సంచరించటంగాని, అనేకవిధముల త్యాగమునకు పూనుకొనటంగాని, కేవలము ఒకవిధమైన ఆదర్శవంతమైమ జీవితాన్ని అందించుకునే మార్గములేతప్ప అన్యమైన మార్గములు కావనే సత్యాన్ని మనం గుర్తించాలి.

సత్యము తెలిసికొనకుండా ఉండినంతవరకూ మనకు సందియము తప్పింది కాదు. సందేజము మనలో ప్రవేశించెనా సత్యము మనకు గోచరము కాదు. వీధివాకిటిలో సందేహము ప్రవేశిస్తే పెరటివాకిటిలో నమ్మకమనేదిపారిపోతుందట. కనుక, మన నమ్మకము పారిపోతున్నదనగా ఏమిటి? వీధివాకిటినుండి సందేహములు మన ఇంటిలో ప్రవేశిస్తున్నాయి. సందేహము అనేది హృద్రోగము. ఈ హృద్రోగమనేది ఏదో క్షణములో పెనుభూతమువలె మ్రింగిపోతుంది. కనుక, మనను మ్రింగే పెనుభూతము ఏమిటంటే హృద్రోగము, హృద్రోగము ఏదంటే సందేహము. కనుకనే, 'సంశయాత్మా వినశ్యతి' అని భగవద్గీత బోధిస్తూ వచ్చింది. నీకు సంశయమున్నంత వరకు వినాశము తప్పింది కాదు. కనుక, నీవు పరిపూర్ణ నమ్మకముతో కార్యరంగములో కాలిడు.

ఈనాడు బాలవికాస్ గురువులందరూ నిస్సంశయముగా మనము నిర్ణయించిన ఆశయాలను పవిత్ర హృదయాలతో ఆచరణలో పెట్టాలి. ఇవి చాలా ఉత్తమమైన ఆశయాలు, పవిత్ర సాధనలు అని మనము బహిరంగ సభలలో మాత్రము చెప్పి, మనము ప్రత్యేకంగా నిత్యజీవితములో వాటిని విశ్వసించక, వాటిని ఆచరించకుండాపోయిన ఇది ద్రోహంగా ఏర్పడుతుంది. మనము గొప్పగొప్ప పదములు ఉచ్చరిస్తున్నాగాని, వాటిని ఆచరణలో అతి స్వల్పంగానైనా మనముంచుటలేదు. నేడు లక్షలమైళ్ల దూరంలో ఉన్న చంద్రుని వద్దకైనా ప్రయాణం చేస్తున్నారు. చంద్రునియొక్క తత్త్వాన్ని గుర్తిస్తున్నారు. ప్రక్కింట్లో ఉన్నవారి పరిస్థితి ఎట్లున్నదో గుర్తించటం లేదు. క్రింటివారి పరిస్థితి గుర్తించే శక్తిసామర్థ్యములు మీకు లేనప్పుడు లక్షలమైళ్ల దూరంలో ఉన్న చంద్రుని గుర్తించి ఫలితము ఏమిటి? కనుక, మనము గొప్పగొప్ప భావములంతా ప్రసరించటంగాని, ప్రబోధించటంగాని అధికంగా చేయక, చిన్నచిన్న విషయాలను మనము ఆచరణలో పెట్టి అధష్టానములో ఇనుగ్రహించి, తద్వారా ఇతరులకు అందించే ఆశయాన్ని మనం నిరూపించాలి.

ఈనాడు బాలవికాస్‌యొక్క సమావేశ నిర్ణయాలలో అనేకవిధములుగా సలహాలు అందుకొని కొన్నికొన్ని నిర్ణయాలను మనము నిరూపిస్తూ వచ్చాము. ఇందులో ప్రధానమైన కొన్ని విషయాలను మీకు నేను తెలపాలని ఆసిస్తున్నాను. బాలవికాస్ గురువులను సరియైన మార్గములో తీర్చిదిద్దాలంటే, గురువులకు గురువులైనవారే దీన్ని తీర్చిదిద్దటానికి వీలవుతుంది. అనగా విద్యావిషయములను చక్కగా తెలిసినవాడు, విద్యారహస్యాన్ని చక్కగా గుర్తించినవాడు, పిల్లలకు ఏవిధంగా బ్రోధించాలి అనే ప్రేమతత్త్వాన్ని కలిగినవాడు ఈ విద్యాగురువులకు కొంతవరకు సలహాలందించేవాడుగా వుంటే ఈ విద్యసమస్యలు మరింత విరివిగా తీరటానికి అవకాశముంటుంది. ఈ బాలవికాస్ గురువులు స్టేట్ ప్రెసిడెంటు స్వాధీనములో వుండటంచేత అంత అభివృద్ధి కావటం లేదు. కారణమేమనగా అన్ని స్టేట్ల ప్రెసిడెంట్లుకూడా విద్యావంతులుగానీ, గుణవంతులుగానీ, ఆదర్శవంతమైన జీవితాన్ని అందించేవారుగానీ, బాలలకు ఏవిధముగా బ్రోధించాలనే శక్తిసామర్థ్యములుగానీ లేకపోవచ్చు. వారివారి అనుభవములు ప్రత్యేకించి వుండవచ్చు. వారి నిత్యజీవితములో ఇంకొక మార్గమును అవలంబించవచ్చు. కనుక, నా ఉద్దేశ్యమేమనగా బాలవికాస్ గురువులకు స్టేట్ ప్రెసిడెంట్లకు ఏమాత్రమూ సంబంధము వుండకూడదు. స్టేట్ ప్రెసిడెంట్లు కేవలము భజనమండలులు, సేవాసమితులు, సేవాసంస్థలు, సేవాదళములునను ఆధ్యాత్మిక మార్గములో వారెంతవరకైననూ ప్రవేశించవచ్చు. బాలవికాస్ గురువులకు కేవలం కేంద్రమునుంచే సన్నిహితసంబంధము ఏర్పడితే బాగుటుంది. కనుక, ప్రతి విషయాన్ని కేంద్రమునుసరించి, వారు ఆచరించటంచేత ఎంతైనా అభివృద్ధి కావటానికి అవకాశముంటుంది.

ఇంతేకాక మరికొన్ని లోపతాపములు మనం చెప్పుకోవలసివస్తుంది. సహజంగా స్త్రీలు కొంత బలహీనులు. ఒకవిధమైనఆవేశం వచ్చెనా, వారికి కొంతవరకు నిగ్రహించుకొనే శక్తి తక్కువ. కారణమేమనగా, వారికి ఎమోషన్, ఎగ్జైట్‌మెంట్ ఎక్కువ. వచ్చిన తక్షణమే ఆ స్టేట్ ప్రెసిడెంటు అక్కడ వుంటాడు. కనుక, అతని వద్దకు పోయి మొరపెట్టుకోవటము, దానినుంచి కొంత తారుమారు కావటం జరుగుతున్నది. కనుక, ఈ ఎమోషన్‌గాని, ఈ ఎగ్జైట్‌మెంటుగాని, టంతవరకు శాంతపడుటకై కేంద్రానికి

తెలుపటానికి చాలా టైము పడుతుంది. కనుక, కొంతవరకు శాంతపడిపోతుంది. అంతేకాకుండా వారు అన్నీ కేంద్రానికి తెలుపటానికి కొంచెం భయపడతారు. ఈ గురువులలో కొన్ని అవకతవకలేర్పడటానికి ఏమాత్రమూ అవకాశముండదు. కొంత భయముచేతను, కొంత వినయముచేతను, సక్రమమైన మార్గాన్ని అవలంబించటానికి అవకాశమేర్పడుతుంది. నేటినుండి బాలవికాస్ గురువులు వారివారి సమస్యలు 'కన్వీనర్, బాలవికాస్ గురూస్, ప్రశాంతినిలయము' అని ఎడ్రస్ వ్రాసి వేసేస్తే నేనిక్కడ అన్నీ చూచుకుంటాను. క్రింద 'కాపీ టు వరల్డ్ కౌన్సిల్ సెక్రెటరీ' అని ఇందులాల్‌షాకు పంపించాలి. కనుక, ఈ మార్పులుగాని, కూర్పులుగానీ ఇతరులు చేయటానికి ఏమాత్రమూ అవకాశము లేదు. ఒక్క కేంద్రమునుండి మాత్రమే జరగాలి. ఒకరిపైనొకరు తంటాలు చెప్పుకోటంగాని, ఓర్వలేనితనంతో కొన్ని లేనిపోనివి పుట్టించటంగాని మన బాలవికాస్ గురువులలో ఏమాత్రమూ జరగకూడదు. ఏమైనా తప్పులు జరిగినప్పుడు మనలోమనం నిగ్రహించుకోవాలి. ఏనాడు మనం నిగ్రహాన్ని సాధిస్తామోఆనాడే మనం అనుగ్రహానికి పాత్రులౌతాం.

బాలవికాస్ గురువులు ఈ నిగ్రహశక్తిని అధికంగా పోషించుకోవాలి. అందరూకూడను అక్కచెల్లెళ్ళవలె, అన్నదమ్ములవలె మెలగినప్పుడే మనము విద్యార్థులకు బోధించటానికి అధికారువమౌతాము. మనలోమనకే భేదములు, మనలోమనకే అసూయాభావములు వుండినట్లుగా విద్యార్థులకు తెలిస్తే ఇక విద్యర్తులు ఏమాత్రమూ బాగుపడరు. కనుక, తెలిసో తెలియకో ఇంతకు పూర్వము వచ్చిన పొరపాట్లను మనం సవరించుకొని సరియైన మార్గములో మనము ప్రబోధించటానికి తగిన కృషి చేయాలి. ఇద్దరు బాలవికాస్ గురువులలోపల ఒకరికొకరికి ఏమైనా మనస్తాపము కలిగిందీ అని తెలిస్తే ఇద్దరినీకూడా తీసివేస్తాము. ఇందులో ఎవరిది దోషము అని విచారించము. ఇద్దరినీ తీసివేస్తాము. ఇలాంటి చీడపురుగు ఒకటి వున్నా ఇది అనేకవిధములుగా ప్రాకిపోతుంది. ఈవిధమైన చర్యను పూర్వమునుండీ తీసుకొనకపోవటం చేతనే ఇంతమంది గురువులువుంటుండికూడా శిష్యులు తక్కువగా వున్నారంటే ఇది చాలా కష్టంగా వుంటున్నది. సంవత్సరమునకు ఒక్కొక్క గురువు నూరుమంది విద్యార్థులను తరిఫీదు చేయాలి. అప్పుడే ఐదు లక్షలమందైనా, ఒక లక్షమందైనా సంవత్సరానికి పవిత్రులను గావించటానికి అవకాశం ఏర్పడుతుంది. కనుక, మనదేశంలో తొమ్మిదికోట్ల ఇరువదిఆరువేల బాలబాలికలుంటున్నారు. వీరు ఏ వయస్సు వారు, పది సంవత్సరముల లోపువారే. పదహారు సంవత్సరముల లోపువారు ఇరవైరెండుకోట్ల ఆరు లక్షలమంది వుంటున్నారు. ఏతావాతా అర్థభాగము యువకులుగా వుంటున్నారు మన భారతదేశములో. సంవత్సరానికి ఒక వెయ్యిమందినే తయారుచేస్తున్నామంటే ఇన్ని కోట్లమందిని ఏనాడు మనం తయారుచేయగలం? కనుక, ఇది కేవలము ఒక తాబేలు నడకలా నడుస్తున్నది. కనుక, ఇది శీఘ్రమైన స్థితిలో ఉన్నతస్థాయిని అందుకోవాలి.

దేశముయొక్క పరిస్థితి మీకు తెలియనిది కాదు. యువకులయొక్క ఉద్రేకాలుతనీ, యువకులయొక్క ఆశయాలుగానీ, యువకులయొక్క తెలివితేటలుగానీ క్షణక్షణానికీ ఆకాశానికి ఎగురుతున్నాయి. ఇవి ఏవిధమైన వేగముతో పెరుగుతున్నాయో ఆవిధమైన వేగముతోనే తగ్గించటానికి ప్రయత్నం చేయాలి. పెరిగే వేగమునకు తగ్గించే వేగమునకు సరిసమానమైన స్థితి వుంటుండాలి. అప్పుడే జగత్తు ప్రశాంతిని అందుకోటానికి వీలవుతుంది. ఒక చిన్న ఉదాహరణము. వర్షములు కుంభములతో పోసినట్లు కురుస్తున్నాయి. కానీ, భూమిలోనికి యిమిడిపోవటము చాలా ఆలస్యంగా జరుగుతున్నాది. ఒక్క సంవత్సరము యిమిడిపోయిన జలమును, మనము పదినిముషాలలో బయటకి కొట్టేస్తున్నాము. ఇమిడిపోవటం చాలా ఆలస్యముగా వుంది. కొట్టివేయటం చాలా అధికంగా వుండటం వలననే మనము ఈనాడు జలాన్ని కూడను సమృద్ధిగా అనుభవించుకోలేని బలహీనులుగా వుంటున్నాము. ఏనాడు నీటికొరతను మనం తీర్చుకోగలము? ఏవిధంగా పైకి కొడుతున్నామో ఆవిధంగానే క్రిందికి పోయే వేగాన్ని కనిపెట్టినప్పుడే ఈ జలమునందుకోగలము. అదేవిధముగనే పిల్లలయొక్క ఆశయాలు, అశాంతులు, పిల్లలయొక్క అల్లకల్లోలాలు అతివేగంగా పెరుగుతున్న సమయంలో మనము నిదానంగా దానిని సరిదిద్దుకోటానికి ప్రయత్నంచేస్తే సరియైన సమయానికి పూర్తిచేసుకోలేము. కనుక, మన ఆశయాలనుకూడను అమితంగా ఆచరించటం చేత అనేకమందిని ఆకర్షించటానికికానీ, అనేకమందిని తీర్చిదిద్దటానికిగానీ అవకాశం ఏర్పడుతుంది. ఇంక మరొక విషయము. మనము అన్ని మతములయొక్క సమత్వాన్ని ప్రబోధించాలి. 'బైబిల్'నందున్న కొటేషన్స్, ఆదర్శాలు, 'ఖురాన్'నందున్న ఆదర్శాలు, జోరాష్ట్రయన్‌లో పార్శీవారియందున్న ఆదర్శాలు, సర్వమతములందున్న ఆదర్శాలు పిల్లలకు చక్కగా కథలరూపకంగా సరైన రీతిగా తెలిసేటట్లు బోధించాలి. ఏ మతమునుకూడా మన బాలవికాస్ గురువులు ద్వేషించకూడదు. ఒక మతమునకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వకూడదు. అనేకమంది భగద్గీతలో వున్న శ్లోకాలన్నీ నేర్పించాలన్నారు. అది చాలా పొరపాటు. వారి శ్రద్ధాభక్తులతో వారు నేర్చుకోటంలో మన అభ్యంతరమేమీ లేదు. కానీ, మనము బోధించవలసినది మాత్రము ఖురాన్, బైబిల్ అను గ్రంథములందున్నవి. అట్లే సర్వమతములయొక్క అభిప్రాయములను చక్కగా పిల్లలకు అర్థమయ్యేరీతిగా చెప్పాలి. సర్వమతసమన్వయమే సాయిమతమనేది మీరు చక్కగా గుర్తించాలి.

కొన్ని మతములు సాయిమతమును విరుద్ధపరచినప్పటికీ, మనము మాత్రము విరుద్ధంగా భావించకూడదు. మతమును విరుద్ధంగా భావించేవారు అల్పులు, సర్వమతములను సమంగా భావించేవాడు పూర్ణుడు. కనుక, మనముకూడా అల్ప బుద్ధులచేత ఛిన్నాభిన్నమైన మార్గమును అనుసరించి సంకుతమైన భావమున మనము ఏమాత్రమూకూడా ప్రవేశించకూడదు. ఈవిధమైన

విశాలమైన హృదయాన్ని గురువులు అభివృద్ధి పరుచుకోవాలి. అప్పుడే మన ఆశయాలు యావత్ప్రపంచమునకుకూడా ప్రచారప్రబోధలుచేసే అర్హత కల్గివుంటుంది. ఇంకా కొన్నికొన్ని మార్గములందు పిల్లలకు సత్యమును పలకాలి అనుదానిని సత్యమార్గము ప్రవేశపెట్టాలి. ప్రతి అధ్యాపకుడుకూడా చిరునవ్వు చిందులుతొక్కుచుండేట్లుగా పిల్లలకు బోధించాలి. వారిని కోపించటంగాని, లేక కొట్టటంగాని ఈవిధమైన శిక్షణను మనం ఏమాత్రమూ అవలంబించకూడదు. ప్రేమతో, శాంతముతో, సహనముతో మనం సాధించే కార్యము.

ఇది బృహత్కార్యము. ఈ బృహత్కార్యాన్ని సాధించటానికి ప్రేమతత్త్వమే ప్రధాన మార్గము. ఏ కించిత్తైనా అహంకారఅసూయలకు అవకాశమీయకూడదు. కనుక, ఈనాడు మనము విన్న దేహేంద్రియ మనోబుద్ధి తత్త్వములను ఈ చిరుతప్రాయము నుండియే పిల్లలకు చక్కగా బోధిస్తూరావటంచేత ఈ అహంకారమమకారములకు ఏమాత్రమూ చోటులేకుండా, స్వార్థమనే పెనుభూతమునకు ఏమాత్రమూ గురికాకుండా, దేశాన్ని ఉద్ధరించు వీరులుగా, శూరులుగా, ఘనులుగా అభివృద్ధిగావించు అవకాశాన్ని ఈనాడు మనం చేపట్టాలి. ఈవిధమైన శిక్షణము మనము విద్యార్థులకు అందించినప్పుడే దేశోద్ధారమునకు ఎంతైనా సేవచేసినవారమౌతాము. పిల్లలతో చక్కగా అతిమధురమైన కంఠములచేత భజనలు చేయించాలి.

(బాలవికాస్ గురువుల సమ్మేళనం, ప్రశాంతినిలయం, 21-11-1979)